సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 17 । జనవరి । 2023



సోమారామంలో గోపూజ

భీమవరం (ప్రకాశంచౌక్): పంచారామ క్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయం (సోమారామం)లో గోపూజ నిర్వహించారు.



కిరీటాల సమర్పణ

ముదినేపల్లి రూరల్: వడాలిలో సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయానికి ఒక్కొక్కటి మూడున్నర కిలోల మూడు వెండి కిరీటాలను అభివృద్ధి కమిటీ సభ్యులు అందజేశారు.



వెండి విరాళం

తాడేపల్లిగూడెం అర్బన్: బలుసులమ్మవారికి వట్టి పోతురాజు భార్య వెంకట సుబ్బాయమ్మ సౌజన్యంలో కుమారుడు సోమేశ్వరరావు రూ.లక్ష విలువైన వెండిని సమర్పించారు.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. గ్రామోత్సవం



క్షీరారామలింగేశ్వరస్వామి గ్రామోత్సవం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో కనుమ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. దాతలు పోతిరెడ్డి కామరాజు, గాదిరాజు అమ్మిరాజు కుటుంబాలకు చెందిన వారు వార్షిక పూజలో భాగంగా ఏటా కనుమ ఉత్సవంలో పాల్గొనడం ఆనవాయితీ అని ఆలయ ఈఓ యార్ల సూర్యనారాయణ తెలిపారు. కనుమ ఉత్సవంలో భాగంగా లక్ష్మీ జనార్దనస్వామి వార్లను గరుడ వాహనంపై, పార్వతీ సమేత క్షీరారామలింగేశ్వరస్వామిని నంది వాహనంపై, బ్రహ్మదేవుడిని శాలివాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. వేద పండితులు భమిడపాటి వెంకన్న, మద్దూరి సూరిబాబు పూజాదికాలు నిర్వహించారు. ఆలయంలో నిత్యాన్నదాన నిమిత్తం ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడు రెల్లి నరసింహరావు, లలిత దంపతులు రూ.10,116ను విరాళంగా అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా ముందుగానే ప్రకటించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉన్నత పాఠశాలల్లో తాత్కాలిక సర్దుబాటులో భాగంగా ఎస్ఏ ఇంగ్లిష్ పోస్టులకు పదోన్నతి పొందడానికి అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల జాబితా ముందుగానే ప్రకటించి అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు విద్యాశాఖాధికారులను కోరారు. ఇప్పటికే మండలాల వారీ అర్హుల జాబితా ప్రకటించారని, అనంతరం మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని పాటించి జాబితా ప్రకటించడమే కాకుండా వాటిపై అభ్యంతరాలను తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఈనెల 17న తాత్కాలిక సర్దుబాటుకు కౌన్సెలింగ్ నిర్వహిస్తే అవకతవకలకు అవకాశం ఇచ్చినట్లవుతుందన్నారు. ఈనెల 13న జరిగిన కౌన్సెలింగ్ కోసం తయారుచేసిన జాబితాలో ఆరుగురి పేర్లు రెండు వేర్వేరు క్రమ సంఖ్యల్లో పొందుపరిచారని గుర్తుచేశారు. ఇటువంటి తప్పిదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే సీనియారిటీ జాబితా ముందుగానే ప్రకటించాలని కోరారు.

పారిజాతగిరిలో అధ్యయనోత్సవం



గోకుల తిరుమల పారిజాతగిరి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మూడు రోజులపాటు నిర్వహించే ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవం ప్రారంభమైందని ఆలయ కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కోరుకొండకు చెందిన మార్గపురి రంగాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో దివ్య ప్రబంధ సేవా కాలం నిర్వహిస్తారన్నారు. 19వ తేదీన రాత్రి నమ్మాల్వార్ పరమపద ఉత్సవంతో కార్యక్రమం ముగుస్తుందన్నారు.

విందుకు 'వంద'నం



కాబోయే అల్లుడికి 100 రకాల పిండి వంటలతో ఏర్పాటుచేసిన విందు

సాక్షి, భీమవరం: సంక్రాంతి సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లాలో కొత్త అల్లుళ్లకు అతిథి మర్యాదలు చేయడంలో పోటీపడుతున్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కూర్మదాసు కృష్ణ, శిరీష దంపతుల కాబోయే అల్లుడు పొన్నగంటి సాయినాథ్‌కు సోమవారం 100 రకాల పిండి వంటలతో విందు ఏర్పాటు చేశారు. సాయినాథ్, శ్రీహితకు వచ్చే మార్చిలో వివాహం జరుగనుంది. ఈ నేపథ్యంలో కాబోయే అల్లుడిని ఇంటికి పిలిచి దాదాపు 30 రకాల రైస్ ఐటమ్స్, వివిధ రకాల స్వీట్లు, ఐస్‌క్రీమ్స్‌తో భోజనం పెట్టారు.

జూదాలపై ఉక్కుపాదం

- జూద సామగ్రి స్వాధీనం
- తొలగించిన షామియానాలు
- 1,608 మందిపై కేసుల నమోదు
- రూ.22.70 లక్షల స్వాధీనం



ఆకివీడులో జూదాలు నిర్వహించే ప్రాంతాల్లో దాడులు చేసి షామియానాలు తొలగిస్తున్న పోలీసులు



పిప్పరలో గుండాట నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



కుక్కునూరు మండలంలో గుండాట బోర్డులను తొలగిస్తున్న పోలీసులు

సాక్షి, భీమవరం: సంక్రాంతి పండగ రోజుల్లో జూదాలను అరికట్టడంతో పోలీసులు విజయం సాధించారు. భోగి పండగ రోజున అక్కడక్కడా కోడి పందేలతోపాటు జూదాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో ఉక్కుపాదం మోపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా గుండాట, పేకాట, కోడిపందేలు వంటి జూదాలపై 650 చోట్ల దాడులు చేసి 1,608 మందిపై కేసులు నమోదు చేసి వారి నుంచి సుమారు రూ.22.70 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి నుంచి జూదాలు నిర్వహించే ప్రాంతాల్లో దాడులు చేసి షామియాలను ధ్వంసం చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. సంక్రాంతి పండగ మూడు రోజులు సంప్రదాయం పేరుతో కోడి పందేల శిబిరాల వద్ద గుండాట, పేకాట విచ్చలవిడిగా నిర్వహించడం సర్వసాధారణం. పండగలో జూదాల్లో పెద్ద మొత్తంలో సొమ్ములు పోగొట్టుకుని పేద, మధ్యతరగతి వర్గాలు రోడ్డున పడుతున్న సంఘటనలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఈ ఏడాది జిల్లాలో ఎక్కడా జూదాలకు అవకాశం లేదని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ముందుగానే హెచ్చరించారు. దీనిలో భాగంగా దాదాపు నెల రోజుల ముందు నుంచే గ్రామాలు, పట్టణాల్లో పోలీసులు సమావేశాలు నిర్వహించి జూదాల వల్ల కలిగే అనర్థాలను వివరించడంతోపాటు నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో జూదాలు నిర్వహించిన ప్రాంతాల్లో హెచ్చరికగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు.

పందేల మాటున.. సంక్రాంతికి సంప్రదాయంగా కోడిపందేలు నిర్వహించడం పరిపాటి. అయితే కొన్నిచోట్ల పందేలతో పాటు గుండాట, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తుంటారు. బరుల వద్ద భారీ షామియానాలు ఏర్పాటుచేసి జూదగాళ్లకు కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పించి పెద్ద మొత్తంలో జూదాలు నిర్వహిస్తారు. ఇందుకు జూదాలు నిర్వహించే వారు పెద్ద మొత్తంలో బరి నిర్వాహకులకు సొమ్ములు ఇస్తుంటారు. ఈ ఏడాది కొన్నిచోట్ల వేలం పాటలు నిర్వహించి మరీ జూదాలకు స్థలాలను దక్కించుకున్నారు. వీరవాసరం మండలంలోని కోడిపందేల శిబిరం వద్ద జూదాల నిర్వహణకు రూ.48 లక్షలు ఇచ్చారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

శనివారం రాత్రి నుంచే కట్టడి

భోగి పండగ రోజున కోడి పందేలతోపాటు విచ్చలవిడిగా జూదాలు ప్రారంభించడమేగాక శిబిరాల వద్ద భయం లేదని పోలీసులకు పెద్ద మొత్తంలో ముడుపులు ఇచ్చామంటూ నిర్వాహకులు ప్రచారం చేసుకున్నారు. జూదాల నిర్వహణ, ముడుపుల ప్రచారం జిల్లా ఎస్పీల దృష్టికి వెళ్లడంతో పోలీసు శాఖ దాడులు ప్రారంభించింది. శిబిరాల వద్ద షామియాలను తొలగించి జూదాల నిర్వహణకు ఉపయోగించే గుండాట బోర్డులు, బల్లలు వంటి సామగ్రిని, నగదును స్వాధీనం చేసుకున్నారు. జూదాల నిర్వాహకులపై కేసులు కూడా నమోదుచేశారు. దీంతో ఆది, సోమవారాలు జూదాల నిర్వహించిన దాఖలాలు కనిపించలేదు.

అసాంఘిక కార్యకలాపాలను సహించం



పండగల పేరుతో అసాంఘిక కార్యకలాపాలను చేపడితే సహించం. సంక్రాంతి పండగను పురస్కరించుకుని పశ్చిమగోదావరి జిల్లాలో గుండాట, పేకాట, కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై దాడులు చేసి 142 మందిపై కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.4,77,190 నగదు స్వాధీనం చేసుకున్నాం. ప్రజలు కూడా సహకరించి ఎక్కడైనా జూదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఇస్తే మరింత కట్టుదిట్టంగా అరికడతాం.

– యు.రవిప్రకాష్, ఎస్పీ, భీమవరం

ఏలూరు జిల్లాలో..



భీమడోలులో నంబర్స్ ఆటను మూసి వేయిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో పేకాట, గుండాల, కోడిపందేలపై పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. పేకాట శిబిరాలపై 142 చోట్ల దాడులు చేసి 408 మందిపై కేసులు నమోదు చేసి రూ.12,30,405 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుండాటలపై 179 చోట్ల దాడులు చేసి 388 మందిపై కేసులు నమోదు చేసి రూ.2,30,480 నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడిపందేలపై 285 చోట్ల దాడులు చేసి 670 మందిపై కేసులు నమోదు చేసి రూ.3,32,370 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే 323 కోడిపుంజులు, 353 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

మావుళ్లమ్మకు తులాభారం



భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బెల్లంతో తులాభారం సమర్పించి మొక్కుబడి తీర్చుకున్నారు. సోమవారం కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేయించారు. మావుళ్లమ్మవారి వార్షిక మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించడం ఆనందంగా ఉందన్నారు.

- భీమవరం (ప్రకాశంచౌక్)

'వందే భారత్'కు ఘన స్వాగతం



ఏలూరు స్టేషన్‌కు చేరుకున్న వందే భారత్ రైలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశంలో వేగంగా నడిచే రైలును వందే భారత్ పేరుతో రైల్వేశాఖ ప్రారంభించింది. ఈనెల 15న సంక్రాంతి పండగను పురస్కరించుకుని సికింద్రాబాద్–విశాఖ మధ్య నడిచే రైలును ప్రధాని మోదీ ప్రారంభించారు. ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో అధికారులు స్వాగతం పలికారు. తాడేపల్లిగూడెంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు, రాష్ట్ర నాయకులు టి.భోగేశ్వరరావు, ఎస్టీ మోర్చా, మహిళా మోర్చా నాయకులు రైలుకు ఘనంగా స్వాగతం పలికారు.

వేడుకగా ప్రభల తీర్థం



సంస్కృతికి పట్టం: కందరవల్లిలో ప్రభల తీర్థం

పెనుగొండ: సంక్రాంతి పండగ సందర్భంగా కనుమ రోజున కందరవల్లిలో ప్రభల తీర్థం వేడుకగా నిర్వహించారు. కోడేరు, కొడమంచిలి, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి గ్రామాలకు చెందిన ప్రభలను ఊరేగింపుగా కందరవల్లికి తీసుకువచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎస్సై ఎస్‌డీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

పెళ్లి కూతురమ్మ చెరువులో.. గోదావరి జిల్లాల్లో పేర్గాంచిన పెళ్లి కూతురమ్మ తీర్థం పెళ్లి కూతురమ్మ చెరువులో వైభవంగా నిర్వహించారు. ఆచంట నుంచి పల్లకిపై తీసుకువచ్చి పెళ్లి కూతురమ్మ చెరువులో కల్యాణమూర్తులకు తీర్థం నిర్వహించారు. మూడురోజుల పాటు భక్తులతో పెళ్లి కూతరుమ్మ చెరువు ప్రాంతం కిక్కిరిసింది.

గరగాలమ్మ జాతర

సిద్ధాంతంలో గరగాలమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. శెట్టిబలిజ సంఘాల ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, నవగ్రహ వేషధారణలతో ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది.

సంబరాల సంక్రాంతి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. వేడుకలలో భాగంగా సంప్రదాయ కోడిపందేలు ఉత్సాహంగా జరగ్గా తిలకించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరూవాడా హరిదాసుల సందడి, బొమ్మల కొలువులు ఆకట్టుకున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి, కనుమ వేడుకలు అలరించాయి.

– సాక్షి, నెట్‌వర్క్



ఏలూరులోని కోడేలులో కోడిపందేలను తిలకిస్తున్న జనం



నువ్వా.. నేనా.. అంటూ..



పెదవేగిలో బరి వద్ద వాహనాలు



దొడ్డిపట్లలో బొమ్మలకొలువు



కుప్పనపూడిలో హరిదాసు సందడి



దుంపగడపలో పందేలను తిలకిస్తున్న ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి



బారులు తీరిన కార్లు



పందెం శిబిరాల వద్ద యువతుల సెల్ఫీ

క్లుప్తంగా

సినిమాల్లో కూడా రాణిస్తా


విలేకరులతో మాట్లాడుతున్న గెటప్ శ్రీను

ఆకివీడు: బుల్లితెరపై వికసించానని, వెండితెరపై కూడా రాణిస్తానని నటుడు గెటప్ శ్రీను అన్నారు. సంక్రాంతి సందర్భంగా తన స్వగ్రామమైన కాళింగగూడెం వచ్చిన ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. సినిమాల్లో నటించేందుకు హైదరాబాద్ వెళ్లి తాను ఆర్థిక పరిస్థితుల వల్ల బుల్లితెరపై అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నానని చెప్పారు. తొలిసారిగా హీరోగా నటిస్తున్న రాజూ యాదవ్ టీజర్‌ను సంక్రాంతికి యూట్యూబ్‌లో రిలీజ్ చేశామన్నారు. త్వరలోనే సినిమా రిలీజ్ కాబోతుందని చెప్పారు. ఇంతవరకూ 70కి పైగా సినిమాల్లో వివిధ ప్రాతల్లో నటించానని చెప్పారు. మరో రెండు సినిమాలలో హీరోగా నటించేందుకు అవకాశం వచ్చిందని చెప్పారు. మెగాస్టార్ చిరంజీవి ఆదరాభిమానాలతోనే చిత్ర పరిశ్రమలో ఈ స్థాయికి వచ్చానని చెప్పారు.

కమనీయం కనుమ ఉత్సవం

- అట్టహాసంగా దొరసానిపాడుకు తరలి వెళ్లిన శ్రీవారు
- ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు

ద్వారకాతిరుమల: శ్రీవారి కనుమ ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఉత్సవం నిమిత్తం సోమవారం దొరసానిపాడు గ్రామానికి విచ్చేసిన స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని వీక్షించిన భక్తజనులు పరవశించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, చిత్రవిచిత్ర వేషధారణలు, గజ, అశ్వ సేవలు, తీన్మార్, కేరళ డప్పు వాయిద్యాల నడుమ దొరసానిపాడులో సంబరంలా జరిగిన ఈ ఉత్సవం అంబరాన్నంటింది. ముందుగా శ్రీవారి ఆలయంలో మధ్యాహ్నం ఉభయ దేవేరులతో స్వామివారిని రాజాధిరాజ వాహనంలో ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా పురవీధులకు పయనమైంది. తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు, కొండ వెనుక ఉన్న దొరసానిపాడు గ్రామానికి కనుమ ఉత్సవం నిమిత్తం అట్టహాసంగా తరలి వెళ్లారు. గ్రామంలో మహిళలు శ్రీవారి వాహనం వచ్చే దారి పొడవునా రంగవల్లులు తీర్చిదిద్ది పూలతో ఘన స్వాగతం పలికారు. దొరసానిపాడు పురవీధుల్లో తిరుగాడిన అనంతరం స్వామివారు కనుమ మండపం వద్దకు చేరుకుని భక్తులకు దర్శనమిచ్చారు. వేడుకలో పాల్గొన్న ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులకు అర్చకులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.


డప్పు వాయిద్యాల నడుమ అట్టహాసంగా తరలివెళ్తున్న శ్రీవారు


ప్రత్యేక ఆకర్షణగా గజలక్ష్మి


కనుమ మండపం వద్ద శ్రీవారి దర్శనం


ఆకట్టుకున్న కాంతార వేషధారణ


శక్తి వేషధారణ


చిత్ర విచిత్ర వేషధారణలు

కుమార్తె కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు

కైకలూరు: కుమార్తె కనిపించడం లేదంటూ రూరల్ పోలీసు స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాలు ప్రకారం వదర్లపాడుకు చెందిన యువతి (17) డిగ్రీ చదువుతోంది. అదే కాలేజీలో రేవు రాజారత్నం(19) డిగ్రీ చదువుతున్నాడు. ఈ నెల 14 నుంచి వీరిద్దరు కనిపిచడం లేదు. బాలిక తల్లి రాజారత్నంపై అనుమానం వ్యక్తం చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరవల్లిలో వాలీబాల్ పోటీలు ప్రారంభం


ఆరవల్లిలో వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న ప్రముఖ నేత్ర వైద్యులు గుడిమెట్ల రామచంద్రారెడ్డి

అత్తిలి: ఆరవల్లి గ్రామంలోని శ్రీయోగి వేమన 98వ జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 68వ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ వెలగల సుస్మిత, ఎంపీటీసీ దొమ్మేటి రమ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ నేత్ర వైద్యులు గుడిమెట్ల రామచంద్రారెడ్డి వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, కొద్దిసేపు మ్యాచ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రదానం చేసారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, గుడిమెట్ల బ్రహ్మానందరెడ్డి, వెలగల గోపాలరెడ్డి, వెలగల రామకృష్ణారెడ్డి, సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, గొలుగూరి శ్రీరామారెడ్డి, సత్తి త్రిమూర్తులురెడ్డి, సత్తి మోహన రామారెడ్డి, సత్తి పూర్ణచంద్రారెడ్డి, పప్పు త్రినాథరెడ్డి, సత్తి మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రామచంద్రారెడ్డికి సన్మానం

వైద్యవృత్తిలో విశేష సేవలు అందిస్తున్న గుడిమెట్ల రామచంద్రారెడ్డి అభినందనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. ఆరవల్లిలో యోగివేమన 98వ జయంత్యుత్సవాల సందర్భంగా రామచంద్రారెడ్డి దంపతులను ఉత్సవ కమిటీ తరఫున ఘనంగా సన్మానించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి మాట్లాడుతూ ప్రముఖ కంటి వైద్యులు రామచంద్రారెడ్డి ప్రజలకు మంచి సేవలు అందిస్తూ పేరు ప్రఖ్యాతులు సంపాదించారన్నారు.

గల్ఫ్ పంపిస్తానంటూ మోసం


స్పందనలో సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: ఉపాధికోసం గల్ఫ్ పంపిస్తానని తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం గ్రామానికి చెందిన వ్యక్తి తనను మోసగించాడంటూ పాలకోడేరు గ్రామానికి చెందిన బాధితురాలు ఎస్పీ రవిప్రకాష్‌కు ఫిర్యాదు చేసింది. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ రవిప్రకాష్ ఫిర్యాదులు స్వీకరించారు. తన వద్ద కొంతమొత్తంలో నగదు, పాస్‌పోర్టు తీసుకుని గల్ఫ్ పంపించకుండా మోసం చేశాడని తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది. సత్వరమే చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని పాలకోడేరు ఎస్ఐను ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రోజులలో ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే యువత భవిష్యత్తు నాశనమవుతుందని హితవు చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే డయల్ 100, లేదా 95503 51100 నెంబరుకు సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


సంఘటనా స్థలంలో మృతి చెందిన యువకులు

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల ఇసుక ర్యాంపు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. పోలవరం ఎస్ఐ ఎస్.పవన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో హైదరాబాద్‌కు చెందిన మసలి సందీప్‌రెడ్డి (34), గుగ్గులోతు శరత్ నాయక్ (32) సంఘటనా స్థలంలో మృతి చెందారు. సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు స్నేహితులు ఒక కారులో రాజమండ్రి చేరుకుని అక్కడ ఒక రూంలో మకాం వేశారు. ఆదివారం అక్కడి నుండి పోలవరం ప్రాంతానికి వచ్చి సరదాగా గడిపి తిరిగి 12 గంటల సమయంలో కారులో తిరిగి వెళ్తుండగా అతి వేగంగా వెళ్తున్న కారు గూటాల ఇసుక ర్యాంపు వద్ద అదుపు తప్పి ఏటిగట్టు దిగువన తుప్పల్లోకి వెళ్ళిపోయింది. దీంతో కారు పూర్తి దెబ్బతినడమే కాక కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురిని రాజమండ్రి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మృతి చెందిన ఇద్దరి మృతదేహాలను పోలవరం వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు


ఫ్లడ్ లైట్స్ వెలుగులో లీగ్‌దశలో తలపడుతున్న ఆంధ్రా, తెలంగాణ మహిళా జట్లు

నరసాపురం: నరసాపురం రుస్తుంబాదలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 28వ జాతీయస్థాయి పురుషులు, మహిళల కబడ్డీ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతుంది. పురుషుల విభాగంలో 14 రాష్ట్రాల జట్లు, మహిళల విభాగంలో 12 రాష్ట్రాల జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న పోటీల్లో గెలుపుకోసం ప్రతీ జట్టు ప్రయత్నించడంతో పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఫ్లడ్‌లైట్స్ వెలుగుల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. స్టేడియంలో రెండు కోర్టుల్లో పురుషులు, మహిళల జట్లకు వేర్వేరుగా మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రేక్షకులు కూడా పెద్ద ఎత్తున హాజరై పోటీలు తిలకిస్తున్నారు. పోటీల నిర్వాహకులు మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరాం, ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు పీఎస్ఎన్ మూర్తి, గుగ్గిలపు మురళి, వన్నెంరెడ్డి శ్రీనివాస్‌లులు పోటీలు పర్యవేక్షిస్తున్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెంలో తలపడుతున్న నెల్లూరు - ఎర్రగుంటపల్లి టీంలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం సెమీ ఫైనల్స్‌లో నెల్లూరు-ఎర్రగుంటపల్లి టీంలు తలపడ్డాయి. మిగతా పోటీలను మంగళవారానికి వాయిదా వేశారు.

బస్సు కింద పడి వ్యక్తి మృతి

తణుకు: తణుకు పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి సంఘటన స్థలంలో మృతి చెందాడు. పైడిపర్రుకు చెందిన కొత్తపల్లి నాగేశ్వరరావు (50) మరో వ్యక్తితో కలిసి మోటారు సైకిల్‌పై వెళుతుండగా నరేంద్ర సెంటర్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. నాగేశ్వరరావు తలపై నుంచి బస్సు వెనుక చక్రం ఎక్కేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేశ్వరరావు వెనుక చక్రం కిందపడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మృతుడి బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

మెర్విన్ జోన్స్ సేవలు చిరస్మరణీయం



మెర్విన్ జోన్స్ జయంతి సందర్భంగా దుస్తుల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ లయన్స్ క్లబ్ ఫౌండర్ మెర్విన్ జోన్స్ జయంతిని పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జోన్స్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ మెర్విన్ జోన్స్ సేవలు చిరస్మరణీయమని, ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 2 నిమిషాలకు ఏదో ఒక సేవా కార్యక్రమం లయన్స్ ఆధ్వర్యంలో జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొంతాల బాబు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, నార్ని వెంకట కృష్ణారావు, యాదాల శివాజీ, ఎం.రాము, ఎ.శ్రీనివాస్, ఎ.ఉమా మహేశ్వరరావు, బాలబొమ్మల శ్రీనివాస్, ఎం.శివరామరాజు, వి.మురళీ, డైమండ్స్, లియో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మోటారు సైక్లిస్టును ఢీకొన్న కారు

తాడేపల్లిగూడెం రూరల్: మోటారు సైక్లిస్టును కారు ఢీకొన్న ప్రమాదంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఏఎస్సై పీవీకే.దుర్గారావు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన షేక్ బషీర్ తన మోటారు సైకిల్‌పై తాడేపల్లిగూడెం వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామం ప్రకాశరావుపాలెం వెళ్తుండగా వెంకట్రామన్నగూడెం సెంటర్ దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తి తన ఏపీ 27 ఏ9601 నంబరు గల మారుతీ జెన్ కారుతో ఢీకొన్నాడు. దీంతో బషీర్ రెండు కాళ్లు విరిగాయి. అతనిని 108 వాహనంలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారంతో బషీర్ బంధువు షేక్ బాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఏఎస్సై దుర్గారావు తెలిపారు.

మోటారు సైక్లిస్టుకు గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్: మోటారు సైకిల్ అదుపు తప్పి రోడ్డుపై పడటంతో వ్యక్తికి గాయాలైన సంఘటన ముత్యాలంబపురం సమీపంలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన సాంబ్రాణి సూర్యనారాయణ ఉంగుటూరులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి తాడేపల్లిగూడెం వైపు వేగంగా వస్తుండగా, ముత్యాలంబపురం వద్ద మోటారు సైకిల్ అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో సూర్యనారాయణ తలకు గాయమైంది. బాధితుడి బావమరిది యర్రగోగుల వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

పెంటపాడు: పెంటపాడు పోలీసులు పేకాట స్థావరాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. పెంటపాడు కొబ్బరితోటలో పేకాడుతున్న 22 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 3.60 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై జి. సత్యనారాయణ తెలిపారు.

గంట్లమ్మ ఆలయంలో ముదునూరి ప్రత్యేక పూజలు

నరసాపురం: పట్టణంలోని 6వ వార్డులో వేంచేసి ఉన్న శ్రీ గంట్లమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారి ఆలయాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సందర్శించి ఆలయంలో ప్రతత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పతివాడ మార్కెండేయులు, చిట్టూరి కృష్ణ, శిరిగినీడి వెంకన్న, మల్లాడి బుజ్జి తదితరులు ఉన్నారు.

హరిలో రంగ హరి

ఆకివీడు: వంశపారంపర్య వృత్తిగా హరిదాసు వృత్తిని వదులుకోలేకపోతున్నామని, సంస్కృతిని కాపాడాలనే ఉద్దేశంతో పండుగ రోజుల్లో గ్రామాల్లో తిరుగుతున్నామని హరిదాసు పరంకుశం రాంబాబు చెప్పారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో సంక్రాంతి పండుగ ముగింపు సందర్భంగా ఆయా ఇళ్లవద్దకు వెళ్లి 'శ్రీమద్రామాయణ గోవిందో హరి' అంటూ పండుగ ముగిసిందని చెబుతూ ఇంటింటికీ తిరుగుతున్నారు. నాలుగు తరాలుగా హరిదాసు వృత్తిని కొనసాగిస్తున్నామని, నెల పట్టిన రోజుల్లో గ్రామం అంతా తిరిగి ప్రదిక్షణలు చేస్తామని చెప్పారు. తన ముత్తాత కుప్పనపూడి గ్రామంలో హరిదాసుగా పనిచేశారని, తాత, తండ్రి ఇదే ప్రాంతంలో సంక్రాంతి పండుగను ప్రజలతో పంచుకున్నారని చెప్పారు. బతుకుతెరువు కోసం గ్రామం వదలి అమరావతిలో కాపురం ఉంటున్నామని, అక్కడ నుంచి ప్రతి సంక్రాంతి పండుగ నెల రోజులూ గ్రామంలోనే ఉంటామని చెప్పారు. గ్రామస్తులు పెద్ద మనస్సుతో అన్ని విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. గత 30 ఏళ్లుగా హరిదాసుగా పనిచేస్తున్నట్లు రాంబాబు వివరించారు.

సందడిగా సాగిన సంక్రాంతి సంబరాలు

ఇరగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మండలంలోని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి పండుగకు వచ్చిన కొత్త అల్లుళ్లలతో గ్రామాలు కొత్త శోభ సంతరించుకున్నాయి. తూర్పువిప్పర్రు, ఓగిడి, అయినపర్రు, కొత్తపాడు, కావలిపురం, రేలంగి గ్రామాల్లో పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహించారు. గుండాట, పేకాట, కోతాట బరుల వద్ద ఏర్పాటు చేశారు. కోడిపందేల స్థావరాలపై సిబ్బందితో కలిసి దాడి చేసిన ఎస్సై చంద్రశేఖర్ గుండాట, కోడిపందేలు ఆడుతున్న వారిపై 12 కేసులు నమోదు చేసి 34 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 14 కోళ్లు, 14 కత్తులు, రూ. 15 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

కోడి పందేల బరులు వెలవెల

తణుకు టౌన్: సంక్రాంతి సంప్రదాయాల్లో భాగమైన కోడి పందేలు చాటున జరిగే గుండాట, కోతాలను నిషేధించడంతో తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లోని బరులు వెలవెలబోయాయి. ఈ సంవత్సరం గుండాట, కోతాటలను నిలుపుదల చేయడంతో చాలా బరులు జనం లేక వెలవెలబోయాయి. తణుకు మండలంలో దువ్వ, వేల్పూరు. మండపాక, తేతలి, గ్రామాల్లో కోడి పందేలు ఏర్పాటుచేశారు. భోగి రోజున ఆలస్యంగా ప్రారంభమైన కోడి పందేలు తర్వాత సంక్రాంతి, కనుమ రోజుల్లో కేవలం కోడి పందాలే నిర్వహించాలని పోలీసులు ఆదేశాలివ్వడంతో జనం రద్దీ తగ్గింది. దీనితో భారీ అంచనాలతో బరులను ఏర్పాటు చేసినా కోడి పందేలకే అవి పరిమితం కావడంతో జూదరులు నిరాశకు గురయ్యారు.



పెంటపాడులో బరిలో తిలికించేందుకు ఆశక్తి చూపుతున్న చిన్నారులు

ముగిసిన కోడిపందేలు

పెంటపాడు: పెంటపాడు మండలంలో 7 కోడిపందేల బరులు ఏర్పాటు చేశారు. అలంపురం, ప్రత్తిపాడు, పెంటపాడు గ్రామాల్లో పందేలు మూడు రోజుల పాటు జోరుగా కోడి పందేలు నిర్వహించారు. జట్లపాలెంలో కేవలం ఒక్కరోజే పందెం సాగగా కొండేపాడు, మీనవిల్లూరు, రామచంద్రపురంలో నామమాత్రంగా పందేలు సాగాయి. అన్ని గ్రామాల్లో కోడిపందేలను తిలకించేందుకు ప్రధానంగా యువత, చిన్నారులు ఉత్సాహం చూపారు. పందేలతో పాటు, గుండాట జోరుగా సాగాయి.

గ్రామాల్లో ఆటల పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్: డీవైఎఫ్ఐ, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని మాధవరం, ఇటుకులగుంట గ్రామాల్లో సోమవారం వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ సంక్రాంతి ముసుగులో నిర్వహించే కోడిపందేలు,జూదం వంటివాటికి దూరంగా ఏటా ఆటలపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ముగ్గులపోటీల్లో మాధవరంలో మంచాల అమ్ములు, కే.పావని, ఎం.బ్లెస్సీ, ఇటుకులగుంటలో గోకనబోయిన లలిత, హారిక, గోకనబోయిన సుబ్బరాజు బహుమతులు సాధించారు. మాధవరంలో నిర్వహించిన కుర్చీలాటలో ఇండిగమిల్లి సంజన, కొడవటి అశ్విని, ఇటుకులగుంటలో ఏర్పాటు చేసిన బాలబాలికల పరుగు పందెంలో ఎం.విజయ, ఎం.హేమంత్‌కుమార్, చిటికెనబోయిన తేజ, ఆర్.ప్రసన్నకుమార్, కోరశిఖ హర్షిత, గుడ్ల సాయినీరజ విజయం సాధించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. పాలుపూరి సత్యనారాయణ, కండెల్లి సోమరాజు, పాలుపూరి సత్యవతి, పి.జయమ్మ, ఎస్.చిన్ని, మతుకుమిల్లి చింతారావు, మల్లిపూడి మహాలక్ష్మి, పి.చినపెద్దిరాజు, మాగంటి చింతారావు, పాలుపూరి శ్రీనివాస్, లాయి కృష్ణ పాల్గొన్నారు.



కొత్తపాడులో గుండాట శిబిరాలు తొలగిస్తున్న ఎస్సై చంద్రశేఖర్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



మీనవిల్లూరులో పందేలకు సై అంటున్న దృశ్యం

కోడిపందేలపై పోలీసుల దాడి

తాడేపల్లిగూడెం రూరల్: వేర్వేరు గ్రామాల్లో కోడి పందేలపై దాడి చేసి, పది మందిని అదుపులోకి తీసుకున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు. సోమవారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, పట్టింపాలెం, మోదుగ గుంట గ్రామాల్లో కోడిపందేల శిబిరాలపై దాడి చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా పది మందిని అదుపులోకి తీసుకుని వారివద్దనుంచి రూ.3300 నగదు, క్వాయిన్స్, ఫ్లెక్సీలు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

యువత చెడు మార్గంలో పయనించవద్దు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యువత చెడు మార్గాలైన పేకాట, జూదం, కోడిపందేల వైపు వెళ్లకుండా, విష సంస్కృతికి దూరంగా ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని భాగ్యలక్ష్మీపేటలో సంతాన గణపతి ఆలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు లెమన్ స్పూన్, మ్యూజికల్ ఛైర్స్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘాల నాయకులు వర్తనపల్లి కాశీ, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, సత్తిబాబు, రాజు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

తణుకు: తణుకు పట్టణ పరిధిలో వేర్వేరు పేకాట స్థావరాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మొత్తం మూడు కేసుల్లో 14 మందిని అరెస్టు చేసి వారి వద్ద రూ.16,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఒక స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ. 12 వేలు నగదు, మరో ప్రాంతంలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ. 2 వేలు నగదు, మరోచోట ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ. 2,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు





ఉమామహేశ్వరంలో ఆసాదుల నృత్యాల నడుమ పూజలందుకుంటున్న గ్రామదేవత పెంట్లమ్మవారు

పెంటపాడు: ధనుర్మాసం ముగింపు పురస్కరించుకొని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమామహేశ్వరంలో గ్రామ దేవత పెంటమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలు ముగిసాయి. పూరిగుడిలో అమ్మవారిని అలకరించి అభిషేకాలు చేసారు. గ్రామోత్సవం నిర్వహించారు. ఆసాదుల నృత్యాలు, తీన్‌మార్‌డప్పులు, బాణసంచాతో ఊరేగించారు. రాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యం వహించారు. కొండ్రెడ్డి హైమావతి, మాజీ సర్పంచ్ మద్దుకూరి రామకృష్ణ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. కె. పెంటపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో మకరసంక్రాంతి ముందురోజు పురస్కరించుకొని స్వామివారిని భక్తులు ప్రత్యేకంగా దర్శించుకొన్నారు. ఆలయ అర్చకులు గోత్రనామాలతో పూజలు చేసారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఫిట్ పర్సన్ చీమలకొండ సాయి, అర్చకులు త్రిలోచనదాస్, పూర్ణచంద్రత్రిపాఠి, తదితరులు పాల్గొన్నారు. పెంటపాడు బాలవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరునికి పల్లకిసేవ, గరుడవాహన సేవలు చేసారు. వైసీపీ నాయకులు జామి కృష్ణ, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విప్పర్రు సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పసల కుటుంబీకుల ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందరావు, పసల సత్తికొండలు, గంగన్న, మాజీ సర్పంచ్ చంటి తదితరులు పాల్గొన్నారు. పెంటపాడు పార్వతి బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజలలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కొవ్వూరి లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.



పూరిగుడిసెలో అమ్మవారు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా సంక్రాంతిరోజు అమ్మ వారి కళావేదికపై ఏర్పాటు చేసిన శ్రీ మయూరి నృత్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. కూచిపూడి నృత్యకారిణి దొంగ అనిషిత కూచిపూడి నృత్య అభినయాన్ని ప్రశంసించారు. అలాగే జగత్ విజేత నాట్యమండలి మిలట్రీ మాధవరం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కనకదుర్గ మహత్యం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే సోమవారం పిప్పళ్ల ప్రసాద్ భీమవరం వారిచే సాయి సంకీర్తనలు, శ్రీమావుళ్లమ్మవారి నాట్యమండలిచే ప్రదర్శించిన రంగస్థల ఆణిముత్యాలు నాటకం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నీరుల్లికూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి ఉత్సవాల్లో..

నేడు మావుళ్లమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు భరత నాట్యం, 6 గంటలకు సినీ మ్యూజికల్ నైట్, 8 గంటలకు శ్రీ తిరుపతమ్మ మహత్యం నాటకం కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు.

పోలేరమ్మ జాతర ప్రారంభం

ఉండి: యండగండిలో పోలేరమ్మ అమ్మవారి రెండు రోజుల జాతర ఉత్సవాలు సోమవా రం ప్రారంభమయ్యా యి. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కు లు చెల్లించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆయా ప్రాంతాల నుంచి విచ్చేసిన బంధువులు, గ్రామ ప్రజలు జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే భక్తులు ఘటాలు ఇవ్వడం జరిగింది. ఘటాలు ఎత్తుకుని రోడ్డుపై వెళుతున్న గణాచారులకు రోడ్డుపై చీరలు పరచి ఆ చీరలపై చిన్నారులను ఉంచి వారిపై నుంచి గణాచారి దాటి వెళితే బిడ్డలకు మంచి జరుగుతుందని స్థానికుల నమ్మకం. వీధిలో అమ్మవారిని ఉంచి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని పుట్టింటికి పంపించనున్నారు.

బైబిల్ పరీక్షలో విజేతకు నగదు బహుమతి

కాళ్ల: క్రిస్టియన్ యూత్ క్లబ్ ఆఫ్ ఇండియా గత ఏడాది డిసెంబర్ 10న నిర్వహించిన బైబిల్ పరీక్ష ఫలితాల్లో కోపల్లెకు చెందిన కొండేటి ధరణిజా, ఆకివీడు మండలం కమతవానిగూడెంకు చెందిన చుక్కా నీలవేణి, తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామానికి చెందిన గిప్సన్ తొలి మూడు స్థానాల్లో నిలిచినట్లు క్లబ్ వ్యవస్థాపకులు బంటుమిల్లి సురేష్ సోమవారం చెప్పారు. ఈ పరీక్షకు నాలుగు జిల్లాలనుంచి సుమారు వంద మంది హాజరయ్యారన్నారు. మొదటి స్థానంలో నిలిచిన ధరణిజాకు కోపల్లె లూథరన్ చర్చిలో క్లబ్ చైర్మన్ చేతుల మీదుగా రూ.10 వేల నగదును బహూకరించి విజేతకు అభినందించారు. అలాగే రెండు, మూడు స్థానాలు నిలిచిన వారి ప్రాంతాలకు వెళ్లి నగదు బహుమతిని అందజేస్తామన్నారు. స్థానిక ప్యారిస్ పాస్టర్ దాసరి లాజరస్ క్లబ్ ప్రతినిధులకు అభినందనలు తెలియజేసి ప్రార్థించారు. జిల్లా క్లబ్ ప్రెసిడెంట్ యేలేటి న్యూటన్, సీఆర్ దీనరాజు, పీసీసీ బుంగా ఆదాము, తనుకుల జీవరత్నం, చిల్లా సత్తిబాబు, చిల్లా దిలీప్, ఎరుకొండ రాజు, చిల్లా శేఖర్ కొండేటి భూషణం, క్లబ్ ప్రతినిధులు మద్దా రమేష్ బాబు, బుజ్జి పాల్గొన్నారు.



కోపల్లె చర్చిలో బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

● అలరించిన బొమ్మల కొలువు



వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

పాలకొల్లు అర్బన్: సంక్రాంతి పర్వదినం రోజున బొమ్మల కొలువు తీర్చిదిద్దడం భారతీయ సంప్రదాయానికి ప్రతీక అని వైఎస్సార్ సీపీ నాయకురాలు, వాకర్స్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ కర్రా జయసరిత అన్నారు. వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షురాలు నీలిమ ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును క్లబ్ సభ్యులు తిలకించి నీలిమను ప్రత్యేకంగా అభినందించారు. బొమ్మల కొలువులో హిందూ ఆరాధ్యదేవతల ప్రతిమలు, రకరకాల ప్రతిమలు ఏర్పాటు చేశారు.

యువత సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలి

పెంటపాడు: తెలుగు పండుగలు, సంస్కృతీసంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించేలా యువత పాటు పడాలని గూడెం రూరల్ సీఐ మూర్తి కోరారు. ఉమామహేశ్వరంలో గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారి 12 వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన ముగ్గులు, క్రీడా పోటీల్లో విజేతలైన వారికి ఆయన బహుమతులు అందించారు. గ్రామ ప్రముఖుడు రాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడి జీవితాలను వృథా చేసుకుంటున్నారన్నారు. ఈ సంస్కృతిని విడనాడి క్రీడలు, సంప్రదాయ ముగ్గుల పోటీలు, చదువు, సేవా కార్యక్రమాలు చేపడితే ఆయా గ్రామాలు ఎంతో అభివృద్ధి సాధిస్తాయన్నారు. అనంతరం పలువురికి రాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయన తండ్రి దివంగత రాయుడు సాంబయ్య జ్ఞాపకార్థం రెవెన్యూ, పోలీసు సిబ్బందికి వస్త్రదానంతో పాటు, ముగ్గులు తదితర పోటీల్లో ప్రతిభకనపరిచిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు ఎస్సై జి. సత్యనారాయణ, ఏఎస్సై కొప్పిసెట్టి సత్యనారాయణ, ధర్మప్రచారపరిషత్ అధ్యక్షురాలు కొండ్రెడ్డి హైమావతి, రాయుడు శ్రీనివాసరావు కుటుంబసభ్యులు కోడూరి మంగరాజు, కసుకుర్తి శ్రీనివాస్, ఎం. సత్యనారాయణ పాల్గొన్నారు. ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసారు.



ఉమామహేశ్వరంలో దుస్తులు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మూర్తి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శృంగవృక్షంలో పూర్వ విద్యార్థుల సమ్మేళన దృశ్యం

పాలకోడేరు: వారంతా శృంగవృక్షంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదివారు. అనంతరం ఉన్నత చదువుల కోసం, ఉద్యోగాల వేటలో బతుకుదెరువు కోసం తలో దిక్కుకు వెళ్లిపోయారు. మళ్లీ వీరు 37 ఏళ్ల తరువాత సంక్రాంతి రోజు ఆదివారం శృంగవృక్షం ఆర్యవైశ్య కల్యాణ మండపం వేదికగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఆప్యాయంగా పలకరించుకున్నారు. తొలుత తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులు కలిదిండి భీమరాజు, కలిదిండి సుబ్బరాజు, మాసాబత్తుల సత్యనారాయణ, దువ్వూరి రామమూర్తి, కృష్ణమూర్తి, మోహనరావు, లంక జోగయ్యశర్మలను పూర్వ విద్యార్థులు అంతా కలిసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



భీమవరంలో మోషేన్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సాక్షి, భీమవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని, పార్లమెంట్‌లో బిల్లు పెట్టడానికి అసెంబ్లీలో తీర్మానం చేసేలా కృషి చేయాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతల పరశురామ్ వినతిపత్రం అందజేశారు. భీమవరంలో మోషేన్‌రాజును క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని, నూతన పార్లమెంట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలని కోరారు. గ్రామాల నుంచి ఢిల్లీ వరకు ప్రజాపోరు రథయాత్ర జనవరి 26వ తేదీన విశాఖపట్నంలో ప్రారంభించి ఏప్రిల్ 14న ఢిల్లీ యాత్ర చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కె.ముసలయ్య, కె.విజయరావు, రావేల రవి, కొమ్ము రాజు, మిద్దపాక సిద్దులు, వీరన్నపేట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలి

పెనుగొండ: ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవరుచుకోవాలని పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం వడలిలో ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద ఫ్రెండ్స్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం వలన మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. వడలి, పెరవలి, మంగళపాలెం, వడలి జూనియర్స్, వడలి సీనియర్స్, ఓడూరు, వెన్నపువారిపాలెం, ఖండవల్లి-1, 2, దేవ హైస్కూల్ , పండితవిల్లూరు, ఆనందరావు పేట జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కాసాని పెద్దిరాజు, తోట సురేంద్ర, నేలపాటి చిన్ని, ఉటాల చిన్న, తానేటి గిడియన్ రాజు, ఉప్పలపాటి చంటి, కంకిపాటి శ్యామ్, బాబులు పాల్గొన్నారు.

నాగారమ్మ జాతర ప్రారంభం

నరసాపురం: పట్టణంలోని 31వ వార్డులో వేంచేసి ఉన్న ప్రసిద్ధ శ్రీనాగారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 19వ తేదీ వరకూ జరగనున్న ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేస్తున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు ఆకట్టుకున్నాయి. 18వ తేదీ రాత్రి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.